సౌమ్య కుటుంబానికి ప్రభుత్వ విప్ పరామర్శ

సౌమ్య తండ్రిని ఓదార్చుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, మే 28 : ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుడ్ల సౌమ్య కుటుంబాన్ని మంగళవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పరామర్శించారు. పట్టణంలోని యాదగిరిపల్లిలో సౌమ్య ఇంటికి వెళ్లి ఆమె తల్లిదండ్రులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. అమెరికా నుంచి సౌమ్య పార్థివ దేహాన్ని వీలైనంత త్వరగా ఇండియాకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అమెరికాలోని తానా సొసైటీ సభ్యులతో మాట్లాడినట్లు చెప్పారు.

75 శాతం సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలు అందించాలి

- అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు

యాదగిరిగుట్ట, మే 28 : రైతులకు అవసరమైన అన్ని రకాల నాణ్యమైన విత్తనాలను 75 శాతం సబ్సిడీతో ప్రభుత్వం సరఫరా చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం భువనగిరి డివిజన్ నాయకులు వడ్లకొండ నాగరాజు, పంజాల మురళి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అరికట్టాలని, క్రిమి సంహారక మందుల్లో కల్తీని నిర్మూలించాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ఇక్కిరి సిద్ధులు, అన్‌రెడ్డి బాల్‌రెడ్డి, సిద్దేశ్వర్, నీల అర్జున్, బాలమల్లేశ్, జాలపు రాజిరెడ్డి, కట్ట సమరసింహారెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ కల్యాణం

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భానుప్రకాశ్‌గౌడ్-వాణి దంపతులు

రాజాపేట, మే 28 : మండలంలోని కుర్రారంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పాండవుల భానుప్రకాశ్‌గౌడ్-వాణి దంపతుల సహకారంతో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రకాశ్‌గౌడ్ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

అమ్మవారికి భక్తులు బోనాలు, ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాకేశ్‌రెడ్డి గెలుపు ఖాయం

- మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి

రాజాపేటలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి

రాజాపేట, మే 28 : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలో విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డి వైపే పట్టభద్రులు మొగ్గు చూపినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఎర్రగోకుల జశ్వంత్ బూర్గు నర్సిరెడ్డి, బొంగోని ఉప్పలయ్యగౌడ్, ఎడ్ల రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి

మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి శిల్పిని

బొమ్మలరామారం, మే 28 : గ్రామీణ ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించాలని జిల్లా ఉప వైద్యాధికారి శిల్పిని అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రాంలింగంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య ఉప కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మట్లాడుతూ మహిళలు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనారోగ్యానికి గురైనప్పుడు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి తగు వైద్య సాయం పొందాలన్నారు. కార్యక్రమంలో డయేరియా నియంత్రణ అధికారి డాక్టర్ సుమలత, మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ అర్చన, ఆశ కార్యకర్త, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేకుండా చెరువు మట్టి తరలింపు

నెమిలె చెరువులో మట్టి కోసం తవ్విన గుంత

రాజాపేట, మే 28 : అనుమతి లేకుండా మండలంలోని నెమిలె చెరువు నుంచి మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఇటుకబట్టీ వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యాదగిరీశుడికి దర్బార్ సేవ

సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి దర్బార్ సేవోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి సేవోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో కల్యాణోత్సవ సేవను ఊరేగించారు. అనంతరం స్వామిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణతంతు జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు వెండి మొక్కుజోడు సేవోత్సవం చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. క్షేత్రపాలకుడైనా ఆంజనేయ స్వామికి ఆకుపూజ నిర్వహించారు. తమలపాకులతో అర్చన చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా జరిగాయి. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ. 36,59,794 ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.3,93,88,092

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి హుండీ ఆదాయం మూడున్నర కోట్లు దాటిందని ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. మంగళవారం కొండకింద వ్రత మండపంలో 35 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించామని, నగదు రూ.3,93,88,092 కోట్లు, మిశ్రమ బంగారం 174 గ్రాములు, మిశ్రమ వెండి 7 కిలోలు వచ్చిందని తెలిపారు. వీటితోపాటు 1,359 అమెరికా డాలర్లు, 25 ఆస్ట్రేలియా డాలర్లు, ఇంగ్లాండ్‌కు చెందిన 55 ఫౌండ్లు, యూఏఈకి చెందిన 65 దీరమ్స్, యూరోప్‌కు చెందిన 20 యూరోలు, మలేషియాకు చెందిన 1 రింగిట్, నేపాల్‌కు చెందిన 10 రూపీస్, కెనడాకు చెందిన 30 డాలర్లు, సౌదీ అరేబియాకు చెందిన 66 రియాల్స్, సింగపూర్‌కు చెందిన 50 డాలర్లు, స్కాట్లాండ్‌కు చెందిన 5 ఫౌండ్లు, మాల్దీవులకు చెందిన 10 రూపీస్‌తోపాటు మాలవి, మయన్మార్, కువైట్, కతార్, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్ కరెన్సీ ఉన్నట్లు వారు వెల్లడించారు.

నంబర్ ప్లేట్లు సరిగా లేకుంటే కేసులు

వాహనాలను తనిఖీ చేస్తున్న పట్టణ సీఐ సురేశ్‌కుమార్

భువనగిరి అర్బన్, మే 28 : వాహనాల నంబర్ ప్లేట్లు సరిగా లేకుంటే వాటి యజమానులపై కేసులు నమోదు చేస్తామని పట్టణ సీఐ సురేశ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని వినాయకచౌరస్తాలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సరిగా నంబర్ ప్లేట్లు లేని 12 వాహనాల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా నంబర్ ప్లేట్ లేని వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల చైన్ స్నాచింగ్‌లు జరుగుతున్న నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు చెప్పారు. తనిఖీల్లో పట్టణ ఎస్ఐ నాగరాజు, ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, కానిస్టేబుల్ చంద్రశేఖర్, వినోద్, శ్రీనివాస్, సంజీవ, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

సంస్థాన్‌నారాయణపురంలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

సంస్థాన్‌నారాయణపురం, మే 28 : విత్తన ప్యాకెట్లపై లేబుల్ సరిగా లేని కంపెనీల విత్తనాల అమ్మకాలను నిలిపివేసినట్లు ఆలేరు ఏడీఏ స్క్వాడ్ బృందం అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని పలు ఎరువులు, విత్తన దుకాణాల్లో మంగళవారం స్క్వాడ్ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అగ్రిటెక్, తిరుమల, ధాన్యలక్ష్మి కంపెనీలకు చెందిన వరి విత్తనాల బ్యాగులపై డేట్ ఆఫ్ టెస్టింగ్, డేట్ ఆఫ్ ప్యాకింగ్ వివరాలు సరిగా నమోదు చేయకపోవడంతో వాటి అమ్మకాలను నిలిపి వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు నాగరాజు, స్వప్న పాల్గొన్నారు.

బిందు సేద్యంపై అవగాహన

బిందు సేద్యంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారులు

మోత్కూరు, మే 28 : బిందు సేద్యంతో పామాయిల్ సాగు చేయాలని ఉద్యానవన శాఖ క్లస్టర్ అధికారి నసీమా సూచించారు. మంగళవారం మండలంలోని బుజిలాపురంలో పామాయిల్ సాగు చేసిన రైతు ఏగమాటి రాంరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రైతులకు బిందు సేద్యంపై అవగాహన కల్పించారు. బిందు సేద్యంతో నీటి వృధాను అరికట్టవచ్చన్నారు.

ఈ సందర్భంగా నీటి యాజమన్య పద్ధతులు, అధిక ఉష్ణోగ్రతలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో డ్రిప్ డీసీఓ సురేశ్, వెంకటేశ్, సురేందర్, ధనుంజయ, ఉపేందర్ రెడ్డి, రాజిరెడ్డి, మేరి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరి కలెక్టరేట్, మే 28 : మోటార్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు, బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. భువనగిరి మండలం ఆకుతోటబావితండా పరిధిలోని కేకేతండాకు చెందిన మెగావత్ రమేశ్(30)ఈ నెల 25న మండలంలోని అనాజిపురం మీదుగా మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో రమేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బావ గుగులోతు లచ్చిరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

భువనగిరి కలెక్టరేట్, మే 28 : తాటి చెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నందనం గ్రామానికి చెందిన సిద్ధగోని చిన్న నరసింహ గౌడ్ రోజువారి మాదిరిగా మంగళవారం సాయంత్రం కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన నరసింహను గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

మానసిక సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ 14416

- మండల వైద్యాధికారి విలియం కేరి

ఆత్మకూరు(ఎం), మే 28 : మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు టోల్‌ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చని మండల వైద్యాధికారి విలియం కేరి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ... ఆస్పత్రికి వెళ్తే ఇతరులు ఏమనుకుంటారో అనుకునే వారికి ఇది చక్కని అవకాశంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించిన వెంటనే మానసిక పరిస్థితిని బట్టి ఫోన్‌లోనే లేదా జిల్లా, రాష్ట్రస్థాయి వైద్య సిబ్బంది ద్వారా మందులతో అవసరాన్ని బట్టి అడ్మిట్ చేసుకొని చికిత్స చేసి మానసిక స్థితిని మెరుగుపరుస్తారన్నారు. వైద్య సిబ్బంది కూడా ఇలాంటి వారిని గుర్తించి విషయాన్ని తెలియపర్చాలని సూచించారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు

భువనగిరి అర్బన్, మే 28 : ప్రభుత్వం ఆదేశాల మేరకు వేసవిలో తరగతులు నిర్వహించవద్దని డీఈఓ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమించి కొన్ని పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుండా పాఠశాలలు నిర్వహిస్తే జరిమానాతో పాటు పాఠశాలలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఎన్టీఆర్‌కు నివాళి

భూదాన్‌పోచంపల్లి, మే 28 : పట్టణ కేంద్రంలో ఎన్టీఆర్ మహాజన సంఘం ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 101 జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశంగౌడ్, దానయ్య, జంగారెడ్డి, అంజయ్య, నర్సింహ, భూషణం, బక్కయ్య, సత్యనారాయణ, కృష్ణ, లక్ష్మయ్య, జానకిరామ్, గిరివాసు, సత్యనారాయణ, రఘు, మైసయ్య పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో వ్యక్తికి జైలు

అడ్డగూడూరు, మే 28 : చీటింగ్ కేసులో వ్యక్తికి 3 ఏండ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ నాగరాజు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మండలంలోని డి.రేపాక గ్రామంలో 2018లో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా పని చేస్తున్న సమయంలో ఉపాధి హామీ డబ్బులు సొంత అవసరాలకు వాడుకోవడంతో అతనిపై కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా కోర్టులో నేరం రుజువు కావడంతో జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ

- ఒకరికి గాయాలు

భువనగిరి అర్బన్, మే 28 : లారీ ఢీకొని వ్యక్తికి స్వల్ప గాయాలైన సంఘటన పట్టణ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ములుగు జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరాం సత్యం ములుగు నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణ పరిధిలోని నల్లగొండ చౌరస్తా ఫ్లైవర్ సమీపంలోకి రాగానే హైదరాబాద్ వైపు లోడ్‌తో వెళ్తున్న లారీ ఫ్లైఓవర్ ఎక్కే క్రమంలో వెనక్కి వచ్చింది. ఇదే సమయంలో వెనుకాల వెళ్తున్న కారును ఢీకొట్టడంతో కారులో ఉన్న సత్యం గాయపడ్డాడు. కారు ధ్వంసమైంది. సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

దేశ ప్రజలను పక్కదారి పట్టిస్తున్న మోదీ వ్యాఖ్యలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య

భువనగిరి అర్బన్, మే 28 : ప్రధాని మోదీ వ్యాఖ్యలు దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ తప్పుడు మాటలు మాట్లాడుతూ నిజమైన చరిత్రను కనుమరుగు చేసి తప్పుడు చరిత్రలను దేశ ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రధానిగా ఉండి మతాన్ని, మతోన్మాదాన్ని ప్రేరేపించే విధంగా ఉపన్యాసాలు చేయడం ప్రజలను రెచ్చగొట్టడమే అని పేర్కొన్నారు. మోదీ పదేండ్ల పాలనలో రైతులు, కూలీలు, యువజనులు, విద్యార్థులు, మహిళలు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. కార్మిక చట్టాలను కాలరాయడం, రైతుల పొట్టకొట్టి నల్ల చట్టాలు తీసుకురావడం, ఆకలి సూచీలో ఉన్నత స్థాయిలో నిలబెట్టడం, నిరుద్యోగాన్ని పెంచి పోషించడం, పేదరికాన్ని పెంచడం, ధరల భారాన్ని అదుపు చేయలేకపోవడం బీజేపీ పాలనలోనే సాధ్యమైందన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అనేక సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకునేలా కష్టాపడాలని, నిరంతరం ప్రజా సమస్యలను అధ్యయనం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆచరణాత్మకమైన ప్రణాళికను రూపొందించుకొని ప్రజా సమస్యలపై గ్రామీణ స్థాయిలో పోరాటాలు, ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సందిగ్ధంలో పడిందని, ప్రజా సమస్యలపై ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రణాళిక తయారు చేసి తక్షణమే సమస్యలు పరిష్కారమయ్యేలా పరిపాలన సాగించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగ నర్సింహులు, మాటూరు బాలరాజు, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు సిర్పంగి స్వామి, దయ్యాల నర్సింహ, జెల్లెల పెంటయ్య, బబ్బూరి పోశెట్టి, బొడ్డుపల్లి వెంకటేశ్, బొల్లు యాదగిరి, గంగదేవి సైదులు, పగిళ్ల లింగారెడ్డి, దోడ యాదిరెడ్డి, గుంటోజు శ్రీనివాస్‌చారి, గడ్డం వెంకటేశ్, వనం ఉపేందర్, గుండు వెంకటనర్సు, దూపటి వెంకటేశ్, గాడి శ్రీనివాస్, పోతరాజు జహంగీర్, వేముల భిక్షం, దొంతగాని పెద్దులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివ, రాజు

కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, మే 28 : రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం తీసుకువచ్చి విద్యా హక్కు చట్టాన్ని అమలు చేసి అనుమతి లేని విద్యాసంస్థలను మూసివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు డిమాండ్ చేశారు. ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో ఫీజు నియంత్రణ చట్టం అమల్లో ఉన్నా, తెలంగాణలో ఎందుకు అమలుచేయడంలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లె శివ, వేముల నాగరాజు, జిల్లా కమిటీ సభ్యుడు బర్రె రాజు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి : ఏఈఓ

బైరాంనగర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శివకుమార్

ఆలేరు రూరల్, మే 28 : విత్తనాల కొనుగోలుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఈఓ శివకుమార్ అన్నారు. మండలంలోని బైరాంనగర్‌లో నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకొని పంటకాలం పూర్తియ్యేవరకు దాచుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

కొలనుపాకలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఆలేరు రూరల్, మే 28 : మండలంలోని కొలనుపాక భక్తాంజనేయ స్వామి ఆలయంలో హన్‌మాన్ భక్తులు మంగళవారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో హనుమాన్ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

స్వస్తిక్ ఇండస్ట్రీపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు

పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బీబీనగర్, మే 28 : ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామ రైతులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయరావుపేటలో సర్వే నంబర్ 22లో గల స్వస్తిక్ ఇండస్ట్రీ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని, పాడి పశువులు అనారోగ్యానికి గురై చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగోళ్ల సతీశ్‌కుమార్, కలకొండ జయప్రకాశ్, కంచిమేకల వెంకట్‌కుమార్, చిన్నాల రాజు, ప్రభు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం

అదృశ్యమైన జనార్దన్

చౌటుప్పల్, మే 28 : చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ అంకర్ల జనార్దన్ అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 26న ఇంట్లో గొడవ జరుగడంతో మనస్థాపం చెంది ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతని ఆచూకీ లభించకపోడంతో ఆయన కుమారుడు అరుణ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.